వరికి తెగులు.. దిగుబడిపై దిగులు

• మొగి పురుగుతో ఊసపోతున్న వైనం


మొగి పురుగు సోకి ఊసపోతున్న గొలక

గంగాధర: వరి పంట సాగులో ఆరుగాలం శ్రమిస్తున్న అన్నదాతలకు పంట చేతికందే వరకు అనుమానాలే. సాగు నీటి సమస్యతో కొన్ని పంట పొలాలు ఎండిపోతుంటే, సాగు నీటి సమస్య లేని ప్రాంతాల్లో పంట చేతికందే సమయంలో అగ్గి తెగులు సోకుతుంది. తెగుళ్లతోపాటు అకాల వర్షాలు సైతం రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. రెండు రోజుల క్రితం కురిసిన వర్షం ఎండిపోతున్న పంట పొలాలకు ఊరట కలిగించినా.. గొలక దశలో ఉన్న పంట పొలాల రైతులు వడగండ్లు పడతాయేమోనని భయపడ్డారు.

గంగాధర మండలంలో ప్రస్తుత యాసంగిలో 19,500 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. రంగరావుపల్లి, ఉప్పరమల్యాల, తాడిజర్రి, గర్శకుర్తి, కాసారం, కురిక్యాల, వెంకంపల్లి తదితర గ్రామాల్లో రైతులు తెగుళ్లతోపాటు సాగు నీటి సమస్యతో పంట పొలాలు కాపాడుకోవడానికి తంటాలు పడుతున్నారు. బావులు పూడిక తీయిస్తున్నారు. కొత్తగా బోర్లు వేయిస్తున్నారు. ట్యాంకర్లతో పొలాలు పారిస్తూ పంటలను కాపాడుకోవడానికి ప్రయతిస్తున్నారు. అయినా పలువురి రైతుల పంట పొలాలు ఎండిపోయాయి. సాగు నీటి సమస్య లేని గ్రామాల రైతులు పంట పొలాలను తెగుళ్ల తాకిడి నుంచి కాపాడుకోవడానికి తంటాలు పడుతున్నారు. చాలా గ్రామాల్లో వరి పొలాలు ప్రస్తుతం గొలక దశలో ఉన్నాయి. అగ్గి తెగులు సోకి వరి గొలకలు ఎండిపోతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా అగ్గి తెగులును నివారించలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పొలానికి సోకుతున్న అగ్గి తెగులు ఆగకపోతే దిగుబడి తగ్గిపోయి పెట్టుబడులు వచ్చే అవకాశాలు సైతం లేవంటున్నారు.

రెండుసార్లు మందు కొట్టిన



మూడెకరాల్లో వరి పంటను సాగు చేసిన. సమయానుకూలంగా మందులు చల్లిన. ఇప్పటివరకు మంచిగనే ఉంది. గొలక దశ వచ్చేసరికి అగ్గి తెగులు సోకి గొలక ఎండిపోతంది. తెగులు నివారణకు రెండుసార్లు మందు కొట్టినా ఆగడం లేదు. ఇప్పుడు మందు కొట్టినా పని చేయదంటున్నరు. ఇక మిగిలిందే దిగుబడి.

– బండారి బీరయ్య, రైతు, హిమ్మత్‌నగర్

వడ్లు రాలినయ్



సొంత పొలం నాలుగెకరాలతోపాటు 8 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేసిన. ముందుగా వేసిన పొలంలో వరి గొలక వంగింది. రెండు రోజుల క్రితం కొద్దిపాటి వడగండ్ల వానకు వడ్లు రాలినయ్. మిగతా పొలానికి అగ్గి తెగులు సోకి వరి గొలకలు ఎండిపోతున్నయ్.

– సందెవేని తిరుపతి, రైతు, రంగరావుపల్లి

మందులు పిచికారీ చేయాలి



అగ్గి తెగులు నివారణకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని మందులు పిచికారీ చేస్తే తెగులు సోకకుండా కాపాడుకోవచ్చు. కార్బోహైడ్రో క్లోరైడ్ మందును ఒక లీటరు నీటికి గ్రాము కలిపి పిచికారీ చేయాలి. లేదా క్లోరంత్రిప్రోల్ 4 ఎంఎల్ మందును పది లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

– రాచకొండ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి


తిమ్మాపూర్: నెత్తిన బోనాలతో మహిళలు


శ్రీరాములపల్లిలో..


ఇప్పలపల్లిలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు

పోచమ్మ బోనాలు

తిమ్మాపూర్: మక్తపల్లి, తిమ్మాపూర్‌లో పోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. మాజీ సర్పంచ్ గండ్ల భాగ్యలక్ష్మి–శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ పారిపల్లి రాజిరెడ్డి, హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ ఉట్కూరు జనార్దన్‌రెడ్డి, కందుకూరి లక్ష్మీరాజం, చింతం చంద్రయ్య, చింతం లక్ష్మణ్, గాండ్ల రాము, శ్రీనివాస్, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ మాతంగి స్వరూప, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: శ్రీరాములపల్లి గ్రామంలో ఆరె కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ తల్లికి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల ఊరేగింపుతో మహిళలు బోనాలు నెత్తినెత్తుకొని పోచమ్మ దేవాలయానికి వెళ్లారు. అమ్మవారికి ఒడిబియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆరె కుల సంఘం నాయకులు తిప్పారపు వీరన్న, ఇంగ్లె లక్ష్మయ్య, ఎరబాటి కృష్ణ, గారంపల్లి ఆగయ్య, ఇంగ్లె రామారావు, కిషన్‌రావు, లక్ష్మయ్య, సంతాజీ, రవి తదితరులు పాల్గొన్నారు.


మాదాపూర్‌లో..


బొమ్మనపల్లిలో మొక్కులు చెల్లిస్తున్న మహిళలు

శంకరపట్నం: ఇప్పలపల్లి గ్రామంలో ఆదివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మహిళలు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.

గన్నేరువరం: మాదాపూర్ గ్రామంలో గ్రామస్తులు పోచమ్మ బోనాలు నిర్వహించారు.

చిగురుమామిడి: రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల్లో పోచమ్మ తల్లికి బోనాల పండుగ నిర్వహించారు. రేకొండలో వినాయక రెడ్డి సంఘం, బొమ్మనపల్లిలో మాదిగ సామాజిక వర్గం ఆధ్వర్యంలో జరిపారు.


హుజూరాబాద్: గురువులతో పూర్వ విద్యార్థులు


చొప్పదండి పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హుజూరాబాద్: తుమ్మనపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 1987–88లో ఏడోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. అప్పటి ఉపాధ్యాయులు ఎర్రం పాపిరెడ్డి, కనకయ్య, రఘుపతిరెడ్డి, బొక్కల వీరారెడ్డిలను సన్మానించారు. జంజిరాల రమాదేవి, నిమ్మల కొండాల్‌రెడ్డి, బేతి విమల, నిమ్మల హైమావతి, కాసిరెడ్డి రత్నమాల, నిమ్మల మధు, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2014–16లో ఇంటర్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు. పాఠాలు బోధించిన లెక్చరర్లు ఐలయ్య, రాజమౌళి, శరత్‌లను సన్మానించారు. నాగరాజు, శ్రీను, కల్యాణ్, రాజశేఖర్, మహేశ్, ప్రమోద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాల 2008–2011 విద్యాసంవత్సరం కామర్స్ జనరల్ విభాగం విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను సన్మానించారు.


జమ్మికుంట: గురువులతో పూర్వ విద్యార్థులు

భగత్‌సింగ్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

జమ్మికుంట: పట్టణంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల కార్యదర్శి శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆయన పోరాట స్ఫూర్తి కొనసాగిస్తామన్నారు. సీపీఎం నాయకులు వడ్లూరి కిషోర్‌కుమార్, జక్కుల రమేశ్, సతీశ్, గిరవేన రాజు, సదానందం, కిరణ్, రాజేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ మాట్లాడారు. నాయకులు కేశబోయిన రాముయాదవ్, దొమ్మాటి వేణుగోపాల్, రాంపెల్లి రోహిత్, వంశీ, రాజు, మణి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



శంకరపట్నం: వంకాయగూడెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి ముస్లింలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇఫ్తార్ విందు ఇచ్చారు. మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బస్వయ్య, తిరుపతి, ఇసామొద్దీన్, షఫీ తదితరులున్నారు. ఇఫ్తార్ విందును బహిష్కరించినట్లు ముస్లిం జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ రహీం తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక


వంశీకృష్ణరెడ్డికి కండువా కప్పుతున్న కేటీఆర్

గన్నేరువరం: జంగపల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తాడూరి వంశీకృష్ణరెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నేతృత్వంలో ఆదివారం గుండ్లపల్లి వద్ద ఆ పార్టీలో చేరారు.

కేటీఆర్ సభకు తరలిన నాయకులు

చిగురుమామిడి: బీఆర్‌ఎస్ చిన్నముల్కనూర్ మండల నాయకులు కరీంనగర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మండల మాజీ అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు మక్బూల్‌పాషా, నాయకులు నాగెల్లి రాజిరెడ్డి, పిల్లి వేణు తదితరులున్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



తిమ్మాపూర్: మండలంతోపాటు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రావుల రమేశ్‌కు బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే రసమయితో కలిసి మాజీ ఎంపీపీ కేతిరెడ్డి వనిత–దేవేందర్‌రెడ్డి గెస్ట్ హౌస్‌కు వెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు.

క్లుప్తంగా

చింత చెట్టుపై నుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం: అర్కండ్ల గ్రామంలో ఆదివారం చింత చెట్టుపై నుంచి శేర్ల ఓదెలు(60) పడి తీవ్ర గాయాలపాలయ్యాడని స్థానికులు తెలిపారు. ఇంటి ముందున్న చింతకాయ తెంపేందుకు చెట్టు ఎక్కగా.. ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనానికి స్థానికులు ఫోన్ చేయగా.. ఈఎంటీ సతీశ్‌రెడ్డి ప్రథమ చికిత్స చేసి కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

వీణవంక: వల్భాపూర్ గ్రామంలో కుక్కలు వీరంగం సృష్టించాయి. గ్రామానికి చెందిన భిక్షపతి తన ఇంటికి కాలినడకన వెళ్తుండగా.. రెండు కుక్కలు వెంటబడి దాడి చేశాయి. చేరాలు అనే వ్యక్తిపై కూడా దాడి చేయడంతో.. ఇద్దరికి గాయాలయ్యాయి. జమ్మికుంట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఉచిత వైద్యశిబిరాలు


కొలిమికుంటలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

చొప్పదండి: కొలిమికుంటలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయగా.. సన్‌రైజ్, స్టార్ ఆసుపత్రి వైద్యులు 200కు పైగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. ఈసీజీ, షుగర్ టెస్టులు చేసి మందులు అందజేశారు. పట్టణంలోని శ్రీకృష్ణ ఆసుపత్రిలో అమిరిశెట్టి కిషన్ జ్ఞాపకార్థం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సుజాత, డాక్టర్ నరేశ్, కార్తీక్, వసంత తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక


గంగాధర: ఆలయ కమిటీ సభ్యులు

గంగాధర: ఉప్పరమల్యాల గ్రామ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పిల్లి దేవయ్య, ఉపాధ్యక్షులుగా కనకట్ల దేవయ్య, గాదం కొంరయ్య, ప్రధాన కార్యదర్శులుగా ఝుర్జి నర్సయ్య, తొడు రాయమల్లు, కార్యదర్శులుగా సందెమీది రాజయ్య, కనకట్ల శ్రీనివాస్, కోశాధికారిగా దోర్నాల మహిపాల్ రెడ్డి, సలహాదారులుగా దోమకొండ కిషన్, మల్యాల సత్తయ్య ఎన్నికయ్యారు.

అయ్యప్ప సేవాసమితి..


రామడుగు: అయ్యప్ప సేవాసమితి కార్యవర్గం

రామడుగు: అయ్యప్ప సేవాసమితి మండల కార్యవర్గాన్ని ఆదివారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కుమారస్వామి, అధ్యక్షులుగా బద్రి సూర్యం, ఉపాధ్యక్షులుగా పూరెల్ల రవీందర్, సైండ్ల నర్సింగం, ప్రధాన కార్యదర్శిగా ఐతరవేని శ్రీనివాస్, కోశాధికారిగా బొడ్ల శ్రీధర్, సలహాదారుగా నార్ల శ్రీహరి, సంయుక్త కార్యదర్శులుగా కడారి వీరయ్య, వేముల కృష్ణ, సభ్యులుగా వెంకటరమణ, రాజేశ్, మహేశ్, పర్శరాం, సతీశ్, రాజు ఎన్నికయ్యారు.

హుజూరాబాద్: గాయత్రి బ్రాహ్మణ సంఘం ఎన్నికలు ఆదివారం పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో జరిగాయి. అధ్యక్షుడిగా చెన్నూరు సురేశ్, ఎలబాక కృష్ణకుమార్, కార్యదర్శిగా చిట్టెంపల్లి ఉపేందర్‌రావు, దామెర అనురాగ్, రోహిత్ పోటీ పడ్డారు. అధ్యక్షుడిగా సురేశ్, కార్యదర్శిగా అనురాగ్, రోహిత్, ఉపాధ్యక్షుడిగా కొదుమగుళ్ల నందకిషోరాచార్యులు, కోశాధికారిగా భాగవతుల శ్రీకాంత్‌శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

27న వేలం పాట

జమ్మికుంట: కోరపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ గదులను కిరాయికిచ్చేందుకు ఈనెల 27న వేలం పాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి తారకరామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై సంబరాలు


అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గన్నేరువరం: ఎస్సీ వర్గీకరణపై గన్నేరువరంలో దళిత సంఘాల నాయకులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. ర్యాలీ నిర్వహించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కవ్వంపల్లి మునీందర్, రామంచ సంపత్, మాతంగి అనిల్, రాజయ్య, బాబు, ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.



భానుడి ధాటిని తట్టుకోలేక..

మానకొండూర్: సూర్యుడి భగభగలను తట్టుకోలేక చెంజర్లలో ఓ ఫొటోగ్రాఫర్ రేకుల షెడ్డుపై గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేసుకున్నాడు. వారం రోజుల నుంచి ఎండలు మండుతుండడంతో.. ఇనుప రేకులతో వేసిన రేకుల షెడ్డులో ఎండ వేడిని భరించలేక రేకుల చుట్టూ గ్రీన్ మాట్ చుట్టాడు. ఎండ నుంచి కొంత ఉపశమనంగా ఉందంటున్నాడు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గంగాధర: నియోజకవర్గంలోని ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వేసవిలో చొప్పదండి నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం రూ.40వేల కోట్లు ఖర్చు చేసి గ్రామాల్లో పూర్తిస్థాయి తాగునీటి సరఫరా సౌకర్యం కల్పించలేదన్నారు. అవసరమున్న చోట బావులు తవ్వించాలని, బోర్లు, పైపులైన్లు వేయడంతోపాటు మరమ్మతు పనులు చేయాలని సూచించారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న సంఘం బాధ్యులు

హుజూరాబాద్: కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్–సీ అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, పీ4 రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం 4వ ద్వైవార్షిక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. పీ3, పీ4 డివిజన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీ3 అధ్యక్షుడిగా పోలు రవికుమార్, కార్యదర్శిగా జక్కు రజనీకాంత్, కోశాధికారిగా చిలుకమర్రి ప్రవీణ్, పీ4 అధ్యక్షుడిగా అకినపల్లి రంజిత్, కార్యదర్శిగా సంకటి హరీశ్, కోశాధికారిగా ఆడెపు రవికుమార్ ఎన్నికయ్యారు.

మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు


పట్నాలు వేసిన ఒగ్గు పూజారులు, గ్రామస్తులు

మానకొండూర్: చెంజర్ల గ్రామ శివారులో మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఒగ్గు పూజారులు స్వామివారి ఆలయం వద్ద పట్నాలు వేశారు. భక్తులు బోనాలు చెల్లించారు. ఒగ్గు పూజారులు మల్లికార్జునస్వామి చరిత్రను కథ రూపంలో వివరించారు. గడ్డి రేణుక, ముక్కెర చేరాలు, మేకల పర్శయ్య, జంగ భూమయ్య, బూరుగుపల్లి చంద్రమౌళి, బొమ్మల భూమయ్య, బనక పర్శయ్య, గొల్లన సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఉగాది పురస్కారాలు


పురస్కారాలు అందుకున్న మండల కళాకారులు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రంగస్థల, సాంస్కృతిక కళాకారులకు విశ్వావసునామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా పురస్కారాలు అందించారు. ఆదివారం హుస్నాబాద్‌లోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సినీ నటులు ఆర్‌ఎస్ నంద, సీతామహాలక్ష్మి చేతుల మీదుగా శ్రీరామోజు రాజ్‌కుమార్, చందబోయిన పరశురాములు, కుతాడి కొంరయ్య, సొన్నాయిల భరత్, అందె శేఖర్ పురస్కారాలు అందుకున్నారు.

చెరువులోకి నీటి విడుదల


సాగు నీటిని విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గన్నేరువరం: మండలంలోని ఉప కాల్వ–8 ద్వారా మైలారం గ్రామానికి వెళ్లే సబ్ మైనర్ కాల్వకు సాగు నీటిని ఆదివారం కాంగ్రెస్ నాయకులు విడుదల చేశారు. ఆ కాల్వ ద్వారా నీరంతా గ్రామ చెరువులోకి చేరుతోందని తెలిపారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ నీటిని విడుదల చేశామన్నారు.

మురుగు నీరు తొలగింపు

సాక్షి స్పందన



జమ్మికుంట: 30వ వార్డులోని ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి వస్తోందని, అధికారులు పట్టించుకోవడం లేదనే కథనం ఈనెల 17న సాక్షి దిన పత్రికలో ప్రచురితమైంది. మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తాచెదారం తొలగించారు.

సన్మానం


సన్మానిస్తున్న రాజేశ్వర్‌రావు, సంపత్

జమ్మికుంట: తెలంగాణ రాష్ట్ర సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గండి రంజిత్‌గౌడ్‌ను నియమించిన సందర్భంగా ఆదివారం మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ సన్మానించారు.

యువ వికాస పథకం సద్వినియోగం చేసుకోవాలి

గన్నేరువరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు సంపతి ఉదయ్‌కుమార్ కోరారు. ఆదివారం గన్నేరువరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. యువత సంక్షేమానికి ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందన్నారు.